ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు 3
గురువారం 18 జనవరి 2024

● ప్రమాదకరంగా కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి ● పలు చోట్ల కూలిన రక్షణ గోడలు
● స్పీడ్ బ్రేకర్లు, మలుపుల వద్ద కనిపించని సూచికలు
● అధ్వానంగా మారిన కె.జి. రోడ్డు ● రోళ్లపెంట ఘాట్‌లోనూ పొంచి ఉన్న ప్రమాదం

వామ్మో.. నల్లమల ఘాట్




కె.జి.రోడ్డుపై ఇలాంటి గుంతలు ఎన్నో..

ఆత్మకూరు, జనవరి 17: నల్లమలలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ప్రయాణిస్తే ఎవరినైనా మంత్రముగ్ధులు కావాల్సిందే. రోడ్డుకు ఇరువైపుల దట్టమైన అడవులు, అక్కడక్కడ కొండలు, కోనలు, పక్షుల రాగాలు, వర్షాకాలమైతే సెలయేళ్ల అందాలు... ఇలా అనేక విధాలుగా ఈ మార్గాన ప్రకృతి కనువిందు చేస్తోంది. అయితే ఇది ఒకప్పటి మాట. నేడు నల్లమల ఒడిలో సాగే కె.జి. రోడ్డు ప్రయాణమంటేనే ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. దారిపొడవునా గుంతలు ఏర్పడంతో పాటు రక్షణ చర్యలు లేకుండా నల్లమల ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. దీంతో ఈ మార్గాన ప్రయాణించేందుకు భయపడుతున్నారు. నిజానికి నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి ఏర్పాటు కావడంతో ఈ రహదారిని డబుల్ లైన్‌గా మార్చేందుకు అటవీ చట్టాలు అడ్డంకిగా మారాయి. దీంతో దశాబ్దాల కాలంగా నల్లమలలో సింగిల్ లైన్ రహదారే శరణ్యంగా మారింది. ఒకప్పుడు నల్లమలలోని కె.జి.రోడ్డులో వాహనాల రద్దీ అధికంగా ఉండేది కాదు. అయితే రాజధానిగా అమరావతి ఏర్పడినప్పటి నుంచి ఈ రహదారిపై వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలానికి భక్తుల తాకిడి అధికమైన నేపథ్యంలో కె.జి.రోడ్డుపై వాహనాల సంఖ్య ఊహించని విధంగా పెరిగాయి. దీంతో కె.జి.రోడ్డు తరుచూ అస్తవ్యస్తంగా మారుతున్నప్పటికీ ఎప్పటికప్పుడు చేపట్టాల్సిన రోడ్డు నిర్వహణ పట్ల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది.

మహాశివరాత్రి ఉత్సవాలకు తప్పని ఇబ్బందులు

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 8వ తేదిన జరిగే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తుల లక్షలాదిగా తరలివస్తారు. అయితే శ్రీశైలానికి చేరుకునే కె.జి. రోడ్డు మార్గం అధ్వానంగా మారడంతో మల్లన్న భక్తులకు ప్రమాదం పొంచివుంది. గతంలో అనేక మార్లు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని యుద్ధప్రాతిపదికన నిధులను కేటాయించి కె.జి.రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టేవారు. అయితే అప్పటికప్పుడు చేసే పనుల్లో నాణ్యత లోపించడంతో పాటు ప్రయోజనం ఉండేది కాదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దృష్టిలో వుంచుకుని ముందస్తుగా కర్నూలు-గుంటూరు రహదారికి మరమ్మత్తులు చేయిస్తే ఫలితం ఉంటుంది.



అధ్వానంగా కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి



నల్లమల ఘాట్ రోడ్డులో దెబ్బతిన్న రక్షణ గోడలు

కె.జి.రోడ్డుపై దెబ్బతిన్న రక్షణ గోడలు



కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి వెంట పలు చోట్ల రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. అసలే ఇరుకైన మార్గం కావడంతో గతంలో అనేక మార్లు వాహనాలు రక్షణగోడలను ఢీకొన్న సంఘటనల్లో అవి ధ్వంసమయ్యాయి. అయితే వాటిని ఎప్పటికప్పుడు బాగు చేయాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం అవేమి పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. నల్లమలలోని కె.జి.రోడ్డుపై అనేక చోట్ల ఇలాంటి పరిస్థితులు తాండవిస్తుండటంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు వన్యప్రాణుల రక్షణ నేపథ్యంలో వాహనాల వేగాన్ని తగ్గించేలా అనేక చోట్ల స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేసినప్పటికీ వాటి వద్ద ఎటువంటి సూచికలు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలను స్పీడ్‌బ్రేకర్లను గుర్తించలేక ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా పలు మలుపుల వద్ద సూచికలు కూడా లేకపోవడంతో ప్రమాదాలు జరిగేందుకు అస్కారం లేకపోలేదు.

ప్రమాదకరంగా రోళ్లపెంట ఘాట్ రోడ్డు

నల్లమలలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి ఘాట్‌రోడ్డు ప్రమాదకరంగా మారింది. ప్రత్యేకించి కర్నూలు-ప్రకాశం జిల్లాల సరిహద్దులోని రోళ్లపెంట ఘాట్ తొలి మలుపు వద్ద ఎడమ వైపు భారీగా చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించడం కష్టతరంగా మారింది. అలాగే అక్కడి మలుపులో రెండు వైపుల వచ్చే వాహనాలను గుర్తించేందుకు కుంభాకార అద్దాన్ని ఏర్పాటు చేయలేదు. ఈ కారణాలతో అక్కడ రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. అలాగే గత ఏడాది వర్షాకాలంలో రోళ్లపెంట ఘాట్ కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో విరిగిపడిన కొండచరియలను పక్కనే లోయలోకి నెట్టేశారే తప్ప భవిష్యత్‌లో కొండ చరియలు విరిగిపడకుండా ఉండేందుకు శాశ్వత చర్యలను చేపట్టలేదు. అదే ఘాట్ మూడో మలుపు వద్ద రక్షణగోడలు విరిగిపడ్డాయి. అయితే విరిగిపడిన కొంత భాగాన్ని మాత్రమే పునర్ నిర్మాణం చేసినప్పటికీ ఇరువైపుల రక్షణ గోడల పటిష్టతకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.



రోళ్లపెంట ఘాట్‌లో ప్రమాదకరంగా ఉన్న రక్షణ నిర్మాణాలు

రహదారి గుంతలమయం

నల్లమలలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి గుంతలమయంగా దర్శనమిస్తోంది. అసలే సింగిల్ లైన్ రోడ్డు కావడంతో వాహనాల రాకపోలకు సమస్యగా మారుతోంది. అయితే రోడ్డుకు ఇరువైపులా మట్టిని చదును చేయకపోవడం వల్ల వాహనాలు రోడ్డు దిగి తిరిగి రోడ్డుపైకి ఎక్కేందుకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో ద్విచక్రవాహనదారులకు మరింత ప్రమాదకరంగా మారింది. అలాగే చాలా చోట్ల రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో నల్లమలలో ప్రయాణం నరకయాతనగా మారుతోంది. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాకాలంలో ఈగుంతలతో మరింత ఇక్కట్లకు గురికావాల్సి ఉంటుంది. కాగా కె.జి.రోడ్డుపై అనేక చోట్ల గుంతలు ఉన్నప్పటికీ రోడ్డును మరమ్మతులు చేసేందుకు సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదిలావుంటే ప్రకాశం జిల్లా పరిధిలోని కేజీరోడ్డు మరింత అధ్వానంగా మారింది.



గుంతలు పడ్డ రోడ్డు

ప్రయాణికుల సౌకర్యాలే లక్ష్యం

● నంద్యాల రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు పరిశీలించిన ఏజీఎం



నంద్యాల రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎస్‌సీఆర్ ఏజీఎం ధనుంజయరావు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 17: ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు అందించడమే రైల్వే శాఖ లక్ష్యమని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ధనుంజయరావు పేర్కొన్నారు. నంద్యాలలోని రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ప్రత్యేక రైలులో నంద్యాలకు వచ్చిన ఎస్‌సీఆర్ ఏజీఎం ధనుంజయరావు గుంటూరు-గుంతకల్లు రైల్వే డివిజన్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆధునికీకరణ కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ వివరాలను అయన అడిగి తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్ పరిసరాలను, రైల్వే ఇన్‌స్టిట్యూట్, రైల్వే కాలనీ తదితర ప్రదేశాలను పరిశీలించి అభివృద్ధి పనులను ఆరా తీశారు. క్రూలాబీని తనిఖీ చేసి లోకో పైలెట్లు మరింత క్రమశిక్షణగా విధులు నిర్వర్తించాలని, ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలని లోకో పైలెట్లుకు సూచించారు. క్రూలాబీ నిర్వహణ, సిబ్బంది పని తీరు, పని వేళల గురించి అధికారి రవి ప్రకాష్‌తో సమీక్షించారు. విశ్రాంతి గృహం, రన్నింగ్ రూమ్‌ను పరిశీలించి లోకో పైలెట్లు, గార్డుల సౌకర్యాలపై అయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌సీఆర్ ఏజీఎం ధనుంజయరావు మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌లో నంద్యాల రైల్వే స్టేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని, రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించే లక్ష్యంగా రైల్వే శాఖ కృషి చేస్తుందని అన్నారు. అనంతరం ప్రత్యేక స్వీయ చోదక తనిఖీ క్యారేజ్ వాహనంలో నంద్యాల-యర్రగుంట్ల రైల్వే లైన్ పరిశీలనకు వెళ్లారు. అయన వెంట గుంటూరు డివిజన్ మేనేజర్ శ్రీనివాసరావు, అడిషనల్ డీఆర్‌ఎం శ్రీనివాస్, గుంటూరు - గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ హర్ష, నంద్యాల రైల్వే మేనేజర్ దొరస్వామి, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

● నేటితో ముగియనున్న సంక్రాంతి ఉత్సవాలు

శ్రీశైలం, జనవరి 17: శ్రీశైలం మహక్షేత్రంలో ఏడు రోజులపాటు జరిగే మకరసంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం యాగపూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా మల్లికార్జున స్వామి, భ్రమరాంబఅమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి యాగశాలలో చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించి యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం జరిపించారు. అర్చకులు, వేదపండితులు వసంతోత్సవం నిర్వహించారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయ ప్రధాన ధ్వజస్తంభం వద్ద ధ్వజావరోహణ కార్యక్రమాన్ని జరిపారు. వేదశ్రవణం కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 32 మంది వేదపండితులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డి వారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న సంక్రాంతి ఉత్సవాలు

మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు అశ్వవాహనసేవ ఆలయ ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, ఏకాంతసేవ, శయనోత్సవం నిర్వహిస్తారు.



పుష్కరిణిలో చండీశ్వర స్వామికి త్రిశూల స్నానం వేడుకను నిర్వహిస్తున్న అర్చకులు



హోమగుండంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు, వేదపండితులు, చైర్మన్, ఈవో



స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఎండుమిరప ధర పతనం

ఆదోని (అగ్రికల్చర్) జనవరి 17: ఎండుమిరప ధరలు పతనమయ్యాయి. గత వారంతో పోల్చితే ధరలు మరింత దిగజారడంతో మిరప రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఎండుమిరప బ్యాడిగి రకం క్వింటా గరిష్ఠంగా రూ.20 వేలు పలికింది. బ్యాడిగి రకం మిరప క్వింటా కనిష్ఠ ధర రూ.5 వేలు, గరిష్ఠ ధర రూ.20 వేలు, సింజెంటా క్వింటా కనిష్ఠ ధర రూ.4,500, గరిష్ఠ ధర రూ.13,011, తేజాతాలు కనిష్ఠ ధర రూ.3,900, గరిష్ఠ ధ రూ.16,100, డీడీ క్వింటాలు కనిష్ఠ ధర రూ.4,109, గరిష్ఠ ధర రూ.12,700, కడ్డీ బ్యాడిగి రకం కనిష్ఠంగా రూ.4,100, గరిష్ఠంగా రూ.12,697 పలికింది.

పోలీసు దాడులు..!

● జిల్లా వ్యాప్తంగా 19 బైండోవర్ కేసులు
● 24 మంది అరెస్టు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, జనవరి 17: నంద్యాల జిల్లాలో పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా దాడులు చేస్తున్నారు. బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చెక్‌పోస్టులవద్ద పోలీసులు, సెబ్ అధికారులు తనిఖీలు చేశారు. అలాగే నాటుసారా బట్టీలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 20 కేసులు నమోదు చేసి 24మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి 53లీటర్ల సారాను, రెండు మోటారుసైకిళ్లను సీజ్ చేశారు. 13డీపీఎల్ కేసుల్లో 308మద్యం బాటిళ్లు, రెండు ఎన్‌డీపీఎల్ కేసుల్లో 66 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఒక మట్కా కేసు నమోదు చేసి బీటర్ నుంచి రూ.10,330 స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సిబ్బందితో కలిసి డ్రంకెన్‌డ్రైవ్ చేపట్టి రెండు కేసులు నమోదు చేశారు. 8 ఓపెన్‌డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. 19 బైండోవర్ కేసులు నమోదు చేసి సంబంధిత అధికారుల ఎదుట హాజరు పరచినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెక్ పవర్ లేని చైర్మన్లు


చైర్మన్‌లేని కోడుమూరు మార్కెట్ కమిటీ

- అధికారులు తయారు చేసే నోట్ ఫైళ్లపై సంతకాలకే పరిమితం
- గౌరవ వేతనం రూ.500 నుంచి రూ.1000
- ఖాళీగా పాణ్యం, కోడుమూరు చైర్మన్ పోస్టులు

వైసీపీ ప్రభుత్వంలో మార్కెట్ యార్డులు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని, వాటి వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని రైతులు అంటున్నారు. జగన్ ప్రభుత్వం తమకు చెక్ పవర్ కట్ చేసిందని, దీని వల్ల తాము రైతులకు ఏమీ చేయలేకపోతున్నామని మార్కెట్‌యార్డు పాలక మండలి సభ్యులు, చైర్మన్లు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు కోడుమూరు, పాణ్యం మార్కెట్ కమిటీలకు ఐదేళ్లు పూర్తవుతున్నా ప్రభుత్వం పాలకవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. జగన్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలను దెబ్బతీయడానికే ఈ విధానం అనుసరిస్తోందనే విమర్శలు ఉన్నాయి. దీని వల్ల కొన్ని మార్కెట్ కమిటీల్లో అధికారులు తయారు చేసిన నోట్ ఫైల్ మీద సంతకాలు పెట్టడంతో చైర్మన్ల పాత్ర ముగిసిపోతున్నది. కళ్లముందు అక్రమాలు జరుగుతున్నా చూసీ చూడనట్లు వెళ్లాల్సి వస్తోందని, కమిటీలో తమ మాటకు విలువ లేకుండా పోయిందని కొంత మంది చైర్మన్లు సన్నిహితుల దగ్గర వాపోతున్నారు. కొన్ని మార్కెట్ కమిటీ యార్డుల్లో సెస్సు ఆదాయాన్ని పెంచేందుకు వినియోగించాల్సిన వాహన సౌకర్యం దుర్వినియోగం అవుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 17: ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైసీపీ ప్రభుత్వానికి ముందు 12 మార్కెట్ కమిటీలు పని చేస్తూ ఉండేవి. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మార్కెట్ కమిటీలను బలోపేతం చేస్తానని చెప్పి 12 మార్కెట్ కమిటీలను 15 మార్కెట్ కమిటీలుగా విస్తరించారు. కర్నూలు, ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆలూరు, పత్తికొండ మార్కెట్ కమిటీలతో పాటు మంత్రాలయం, కోడుమూరు, పాణ్యం మార్కెట్ కమిటీలను కొత్తగా ఏర్పాటు చేశారు. వీటిల్లో కర్నూలు, ఆదోని, నంద్యాల సెలక్షన్ గ్రేడ్ కమిటీలు కాగా, ఎమ్మిగనూరు స్పెషల్ గ్రేడ్ కమిటీగా, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, కోవెలకుంట్ల గ్రేడ్-1 కమిటీలుగా, ఆలూరు, ఆత్మకూరు, డోన్ మార్కెట్ కమిటీలను గ్రేడ్-2 కమిటీలుగా మార్చారు. కొత్త కమిటీల ఏర్పాటు, కొన్నిటి స్థాయి పెంచడం తప్ప తమకు ఉపయోగపడేలా ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చైర్మన్లు ఉత్సవ విగ్రహాలే:

అధినాయకులను కాళ్లావేళ్లా పడి ఉన్న డబ్బంతా ఊడ్చిపెట్టి పదవి చేపట్టిన తమకు ఎలాంటి అధికారం లేదని, ప్రభుత్వం నుంచి సహకారం అందడం లేదని మార్కెట్ కమిటీ చైర్మన్లు నిరుత్సాహానికి గురవుతున్నారు. అధికారులు తయారు చేసిన నోట్‌ఫైల్‌పై సంతకాలకే తాము పరిమితం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మార్కెట్ కమిటీల చైర్మన్లకు చెక్‌పవర్ ఉండేది. దీని వల్ల అధికారులు, సిబ్బంది కొంత వరకు చైర్మన్ మాటకు కట్టుబడి ఉండేవారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒకటి, రెండు మార్కెట్ కమిటీల్లోని చైర్మన్లకు తప్పితే.. మిగిలిన మార్కెట్ కమిటీల చైర్మన్లకు ఏ ప్రాధాన్యత లేకుండా పోయింది.

● గౌరవ వేతనం రూ.500 నుంచి రూ.1000:

మార్కెట్ కమిటీలలో చైర్మన్‌తో పాటు 12 మంది డైరెక్టర్లు ఉంటారు. చైర్మన్లకే విలువ లేని పరిస్థితుల్లో డైరెక్టర్ల పదవికి ఎలాంటి ప్రాధాన్యత లేకుండాపోయింది. చైర్మన్లకు మార్కెట్ కమిటీల స్థాయిని బట్టి నెలకు రూ.500 నుంచి రూ.1000 గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తారు. ప్రభుత్వం సెలక్షన్ గ్రేడ్ మార్కెట్ కమిటీలకు సెస్సు ఆదాయాన్ని పెంచుకునేందుకు, గ్రామాల్లో పర్యటించేందుకు మార్కెట్ కమిటీల స్థాయిని బట్టి వాహన సౌకర్యాన్ని కల్పించింది. కర్నూలు, ఆదోని, నంద్యాల మార్కెట్ కమిటీలకు ఏడాది పొడవునా వాహనాన్ని ఏర్పాటు చేయగా.. ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, కోవెలకుంట్ల, ఆలూరు, పత్తికొండ మార్కెట్ కమిటీలకు కేవలం 3 నెలల పాటు వాహన సౌకర్యాన్ని కల్పించారు. మార్కెట్ కమిటీలల్లో చాలా వరకు ఈ వాహనాలను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

● ఐదేళ్లు గడిచిపోతున్నా.. చైర్మన్ పోస్టులు ఖాళీనే:

చైర్మన్ పదవుల కోసం తమ అనుచరులు క్యూ కడుతుండటంతో ఎవరికి ఇవ్వాల్లో అర్థం కాక ఆయా మార్కెట్ కమిటీల పరిధిలోని ఎమ్మెల్యేలు ఐదేళ్లుగా ఆ పోస్టులను ఖాళీ పెట్టేశారు. కోడుమూరు నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మను పోస్టును తాము సూచించిన వ్యక్తికే కట్టబెట్టాలని అధికార పార్టీలోనే ఎమ్మెల్యే సుధాకర్‌తో పాటు కుడా చైర్మన్‌గా కోట్ల హర్షవర్దన్ రెడ్డి పట్టుబడుతున్నారు. దీంతో ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టును ఖాళీగా ఉండిపోయింది. పాణ్యం మార్కెట్ కమిటీకీ చైర్మన్ పదవి పరిస్థితి కూడా ఇంతే. దీన్ని ఇప్పటిదాకా భర్తీ చేయలేదు.

● చైర్మన్లకు చెక్‌పవర్ లేదు



మార్కెట్ కమిటీల చైర్మన్లకు చెక్‌పవర్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. అధికారులు తయారు చేసే నోట్‌ఫైల్‌పై సంతకాన్ని పెట్టే అధికారంతో పాటు మార్కెట్ కమిటీలో పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించే అధికారం చైర్మన్లకు ఉంది. కోడుమూరు మార్కెట్ కమిటీకి చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను నియమించేందుకు ఎమ్మెల్యేలకు లెటరు పంపాం. వారి నుంచి ప్రతిపాదన రాకపోవడంతో నియామకం పెండింగ్‌లో ఉంది.

- నారాయణమూర్తి, ఏడీఎం

ఆధారాలు చూపలేదు.. చార్జిషీట్ వేయలేదు

- సుప్రీంకోర్టు తీర్పుపై సీఐడీ తీరు ఆక్షేపణీయం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జనవరి 17: చంద్రబాబు కేసులో సుప్రీం కోర్టు తీర్పుపై సీఐడీ వ్యవహరించిన తీరు సరిగా లేదని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈకేసులో చంద్రబాబుకు డబ్బు చేరిందనిగాని, కనీసం నిధులు దుర్వినియోగం అయ్యాయనిగాని సీఐడీ ఆధారాలు చూపించలేదని అన్నారు. ఇప్పటి వరకు పెట్టిన ఏ కేసులో కూడా చంద్రబాబుకు గానీ, ఆయన పార్టీ సభ్యులకు గాని ఒక్క రూపాయి చేరినట్లు ఆధారాలు చూపించ లేదని అన్నారు. పార్టీకి వచ్చిన సభ్యత్వ రుసుములను అక్రమ నిధులుగా చూపించాలనే ప్రయత్నాన్ని తెలుగుదేశం సాక్ష్యాధారాలతో తిప్పికొట్టిందని అన్నారు. ఇప్పటి వరకు ఒక్క కేసులో చార్జిషీటు దాఖలు చేసే సత్తా ఈ ప్రభుత్వానికి గాని, తాబేదారు అయిన సీఐడీ సంస్థకు గాని లేదన్నారు. కక్ష పూరిత ధోరణికి ఇంత కంటే నిదర్శనం మరోటి లేదని మండిపడ్డారు.

ఆర్‌యూ వీసీగా ప్రేమ్ కుమార్



కర్నూలు(అర్బన్), జనవరి 17: రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా డాక్టర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్‌ను నియమిస్తూ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సుధీర్ ప్రేమ్ కుమార్‌ను రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా నియమించారు. నవంబరు 17వ తేదీనే ఆయన పేరు ఖరారు అయినట్లు ఆంధ్రజ్యోతి ముందుగానే చెప్పింది. ముగ్గురు ప్రొఫెసర్లు ప్రయత్నించగా ప్రేమ్‌కుమార్ పేరు ఖరారైంది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా 2019 నుంచి 2022 వరకు పని చేశారు. ఆ తర్వాత యాప్సిలో సెక్రటరీగా పనిచేస్తూ తర్వాత తిరిగి మాతృసంస్థ జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌గా చేరారు. ప్రస్తుతం రాయలసీమ యూనివర్సిటికి ఇన్‌చార్జ్ వీసీగా డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.ఫజులూర్ రెహమాన్ కొనసాగుతున్నారు. నవంబరు 24తో గతంలో పని చేసిన ఆకెపోగు ఆనందరావు పదవీ కాలం ముగియడంతో వీసీ పోస్టు కోసం దాదాపు 156 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఏపీ విశ్వవిద్యాలయాల చట్టం-1991 ప్రకారం ప్రేమ్‌కుమార్‌ను గవర్నర్ నియమించారు.

కోటి సంతకాల నిరసన


మొదటి సంతకం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), జనవరి 17: అంగన్‌వాడీల సమ్మె 37వ రోజుకు చేరింది. సమ్మెను ఉధృతం చేయడంలో భాగంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి అంగన్‌వాడీలు కోటి సంతకాల సేకరణ అనే వినూత్న కార్యక్రమం చేపట్టారు. బుధవారం నగరంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీల శిబిరాన్ని ప్రముఖ సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ సందర్శించి కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మొదటి సంతకం చేసి సమ్మెకు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగుల కోర్కెలు న్యాయమైనవని, ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సాయంత్రం అంగన్‌వాడీలు కర్నూలు ప్రాజెక్టుకు సంబంధించిన టీచర్లు ఆయాల నివాసాల గోడలకు అంటించిన నోటీసులకు బదులిస్తూ సంజాయిషీ పత్రాలను కర్నూలు అర్బన్ సీడీపీవోకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎస్.మునెప్ప మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంజాయిషీ పత్రాలకు ప్రభుత్వానికి బదులిచ్చామని అన్నారు. అనంతరం దీక్షల్లో కూర్చున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డ్యూటీలకు ఎవరు హాజరు కావద్దని ప్రతిజ్ఞ చేశారు.

నకిలీ ఔషధ తయారీదారులపై చర్యలు తీసుకోవాలి

పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ సంజీవ్‌కుమార్



కర్నూలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నకిలీ ఔషధాలు తయారు చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ స్టడీ టూర్‌లో భాగంగా మహారాష్ట్రలోని ముంబాయి నగరంలో పలు సంస్థలతో సమావేశం అయ్యారు. ఈ కమిటీ చైర్మన్ శశిధరూర్ హాజరు కాకపోవడంతో ఎంపీ సంజీవ్‌కుమార్ పర్యవేక్షణలోనే సమావేశాలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఫార్మాస్యూటికల్స్, జాతీయ ఫార్మస్యూటికల్స్ ప్రైసింజ్ అథారిటీ, మహారాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటకల్స్ వంటి సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఇందులో డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్య, వైద్యం, న్యాయం మూడు ప్రాథమిక బాధ్యతలు ఉంటాయని అన్నారు. నాణ్యమైన మందులు అందుబాటులోకి తీసుకురావాలని, 75 శాతం రాయితీపై ఇవ్వాలని ప్రభుత్వాలకు ఆయన సూచించారు.

ఆదోనిలో అదృశ్యమయ్యాడు...

సాదాపురంలో శవమయ్యాడు

- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

ఆదోని రూరల్, జనవరి 17 : ఆదోనిలో ఆరు రోజుల క్రితం అదృశ్యమైన ఓ వ్యక్తి సాదాపురంలో శవమై కనిపించాడు. ఆదోని పట్టణంలోని లక్ష్మమ్మవ్వ నగర్‌కు చెందిన గంగాధర్‌కు(33) 10 సంవత్సరాల క్రితం మండలంలోని దిబ్బనకల్లు గ్రామానికి చెందిన ఎస్తేరమ్మతో వివాహమైంది. అయితే మూడు సంవత్సరాల క్రితం భార్య ఎస్తేరమ్మ అతనిని వదిలి వెళ్లిపోయింది. కొన్ని సంవత్సరాలుగా గంగాధర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపంతో ఉన్న గంగాధర్ గత శనివారం సాదాపురంలోని ఓ పొలంలో ఉన్న నీటి గుంత వద్దకు వెళ్ళి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం స్థానికులు ఆ చెరువులో శవాన్ని గుర్తించి రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి, ఎస్ఐ ఎర్రిస్వామిలకు సమాచారం అందించారు. పోలీసులు శవాన్ని వెలికి తీసి మార్చురీకి తరలిస్తుండగా గంగాధర్ బంధువులు అక్కడికి చేరుకొని మృతదేహంపై ఏసుక్రీస్తు పచ్చబొట్టు, ఓంలను చూసి గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

ఎస్ఎస్ఏ ఏపీసీగా విజయజ్యోతి కుమారి


బాధ్యతలు స్వీకరించిన విజయజ్యోతి కుమారి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 17: జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా విజయజ్యోతి కుమారి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గత నెల 27వ తేదీన డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఎస్ఏ పీవోగా పని చేస్తున్న వేణుగోపాల్ మాతృ సంస్థకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం విజయజ్యోతి కుమారి మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వివరించారు. అనంతరం కార్యాలయ అధికారులు, ఉద్యోగులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు.

వెంకయ్యనగర్‌లో చోరీ

కర్నూలు, జనవరి 17: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెంకయ్యనగర్‌లో చోరీ జరిగింది. రాజశేఖర్ రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు చోరీకి గురైంది. రాజశేఖర్ రెడ్డి మెడికల్ రెప్‌గా పని చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి గూడూరు మండలం యనగండ్ల వెళ్లారు. తిరిగి బుధవారం వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న విలువైన ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

28 వరకు కుల గణన సర్వే నిర్వహించండి : కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 17: జిల్లాలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు కుల గణన సర్వే నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. బుధవారం కుల గణన సర్వేపై కలెక్టర్ మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులగణనపై గత నవంబరు, డిసెంబరులో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పాత యాప్ కాకుండా కొత్త వెర్షన్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని వలంటీర్లు సర్వే నిర్వహించాలని అన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

- సైకో పాలనలో బడుగులపై దాడులు, కేసులు
- బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం
- 'జయహో బీసీ' సభలో టీడీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

గడివేముల, జనవరి 17: బీసీల అభివృద్ధి, అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గడివేముల మండల కేంద్రంలో టీడీపీ నాయకులు 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాండ్ర శివానందరెడ్డితో పాటు పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు చరిత, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో టీడీపీ ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చిందన్నారు. గౌరు చరిత మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బీసీల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. అనేక పరిశ్రమలు తీసుకొచ్చి రాష్ట్రాభివృద్ధి చేశారన్నారు. పాణ్యం నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చారని అన్నారు. టీడీపీ బీసీలకు వెన్ను దన్నుగా నిలిచిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని అన్నారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలను చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. పాణ్యం నియోజకవర్గానికి చెందిన ఓ వైసీపీ బీసీ నాయకుడి ఆవేదన సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌లను 34 నుంచి 24 శాతానికి తగ్గించి బీసీలకు రాజ్యాంగ పదవులను దూరం చేశారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి గాలికొదిలేసి తన అభివృద్ధి చూసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇసుక దొరకని పరిస్థితి నెలకొందన్నారు. రైతులకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు ఇస్తామని అన్నారు. వెలగమాను డ్యామ్ పూర్తి చేస్తామన్నారు. గడివేములలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బైపాస్ రోడ్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, యాదవ, వాల్మీకి, బెస్త, ఈడిగ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్లు నాగేశ్వరయాదవ్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్‌గౌడ్, బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందనాయుడు, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌గౌడ్, పాణ్యం బీసీసెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, గిరిబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు సత్యంరెడ్డి, నాయకులు సీతారామిరెడ్డి, రఫిక్, రామచంద్రారెడ్డి, శ్రీనివాసయాదవ్, ఖాలిద్‌బాష, మురళీమోహన్‌రెడ్డి, గణేష్ రెడ్డి, సుబ్రమ్మ, లక్ష్మీదేవి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంది బహుమతులు రావడం అభినందనీయం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


కళాకారులను అభినందిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్) జనవరి 17: రంగస్థల కళాకారులు ప్రతిష్ఠాత్మకంగా భావించే నంది నాటకోత్సవాల్లో కర్నూలు కళాకారులు బహుమతులు సాధించడం అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఇటీవల కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'ఆనంద నిలయం' నాటకానికి రెండు నంది బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా బుధవారం మౌర్య ఇన్‌లోని టీజీ వెంకటేశ్ కార్యాలయంలో తనను కలిసిన కళాకారులను ఆయన అభినందించారు. నాటకంలో తొండమాన్ చక్రవర్తిగా నటించి ఉత్తమ సహాయ నటుడు కేటగిరిలో నంది బహుమతి గెలుచుకున్న పి.భాస్కర్‌ను, నాటక దర్శకుడు వీవీ రమణారెడ్డిని ప్రశంసించారు. భవిషత్తులోనూ జిల్లా నాటక రంగ కీర్తిని చాటి చెప్పాలని టీజీ వెంకటేశ్ కళాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాటకంలో పాత్రలు పోషించిన కళాకారులందరినీ ఆయన శాలువలతో సత్కరించారు.

ఆరేళ్ల చిన్నారికి కరోనా

కర్నూలు(హాస్పిటల్), జనవరి 17: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో బుధవారం రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 45 మందికి ఆర్‌టీపీసీఆర్ టెస్టులు నిర్వహించగా ఇందులో పీడీయాట్రిక్ వార్డులో ఓ బాలికకు, ఏఎంసీలో ఓ వ్యక్తికి కరోనా సోకింది. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని వన్‌టౌన్‌లో ఆరేళ్ల బాలిక, తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లా ఐజలో 50 ఏళ్ల ఉన్న ఓ వ్యక్తికి పాజిటివ్‌గా వచ్చింది. ఇప్పటి వరకు జిల్లాలో కరోనా కేసుల సంఖ్య 25కు చేరాయి.

శ్రీశైల క్షేత్ర సుందరీకరణకు చర్యలు


మొక్కలు నాటి నీరుపోస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలం, జనవరి 17: శ్రీశైల క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలునాటే కార్యక్రమాన్ని దేవస్థానం అధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం క్షేత్రపరిధిలోని పలు చోట్ల మొక్కలు నాటారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని వివిధ ప్రదేశాలలో వివిధ ఆకృతులతో కూడిన మొక్కలను ఏర్పాటు చేశారు. ఇందులో శివలింగం, ఓం, ఏనుగు తదితర ఆలకారాలలో ఏర్పాటు చేసిన మొక్కలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు, జనవరి 17: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కండేరీకి చెందిన తెలుగు శేఖర్ (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురైన ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా.. బంధువులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెం దాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి, జనవరి 17: కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మేరీ బుధవారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ, మండల కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో మేరీ చెప్పారు. అలాగే మండల స్థాయి అధికారులు తమ శాఖ పరిధిలో జరిగిన అభివృద్ధిపై గత మూడు నెలలకు సంబంధించిన నివేదికలతో హాజరు కావాలన్నారు.

సత్తా చాటిన పంచలింగాల ఎద్దులు



ప్రథమ స్థానం సాధించిన పంచలింగాల ఎద్దులు

కొత్తపల్లి, జనవరి 17: మండల కేంద్రమైన కొత్తపల్లిలో తాండవ మల్లేశ్వరస్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాలబండలాగుడు పోటీల్లో కర్నూలు మండలం పంచలింగాల గ్రామానికి చెందిన భైరపోగు వారి ఎద్దులు సత్తాచాటి విజేతలుగా నిలిచాయి. ఈ పోటీలో మొత్తం 2,441.2 అడుగుల దూరం పండ లాగి మొదటి బహుమతిని రూ.50వేలు నగదును గెలుచుకున్నాయి. బుధవారం రాష్ట్ర శాఫ్ చైర్మన్ భైరెడ్డి సిద్ధార్థరెడ్డి యువసేన గ్రామ పెద్దల సమక్షంలో పాలబండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ హోరాహోరీ పోటీల్లో కర్నూలు మండలం పి.రుద్రవరం గ్రామానికి చెందిన ఎల్లగౌడు వృషభాలు 2334.6 అడుగుల దూరం లాగి రెండో బహుమతి రూ.30వేల నగదును కైవసం చేసుకున్నాయి. అలాగే డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన ఎస్ఎస్వీ ట్రేడర్స్ వారి వృషభాలు 2167.4 అడుగుల దూరం లాగి మూడో బహుమతిని రూ.20వేల నగదును గెలుచుకున్నాయి. కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామం కృష్ణప్రసాద్ చెందిన వృషభాలు 2098.1 అడుగు దూరం లాగి నాలుగో బహుమతిని రూ.10వేలు దక్కించుకున్నాయి. అలాగే కర్నూలు మండలం పి.రుద్రవరం గ్రామం గోపాల్‌గౌడుకు చెందిన వృషభాలు 1859.2 అడుగుల దూరం లాగి 5వ బహుమతి రూ.5వేలు కైవసం చేసుకున్నాయి. తుగ్గలి మండలం ఆలంకొండ గ్రామానికి చెందిన మునిరంగడు, బొందిమడుగుల గ్రామానికి చెందిన షేక్షావలి వృషభాలు 1835 అడుగుల దూరం లాగి రూ.3వేలు గెలుచుకున్నాయి. హోరాహోరీగా సాగిన బండలాగుడు పోటీల్లో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొనగా.. వ్యాఖ్యాతగా రామనాయుడు వ్యవహరించారు.

విద్యార్థులు ఉన్నత విద్యను అందిపుచ్చుకోవాలి

పాణ్యం, జనవరి 17 : విద్యార్థులు అంతర్జాతీయ ఉన్నత విద్యను అందిపుచ్చుకోవాలని కర్ణాటక ఇంటర్‌నేషనల్ రిలేషన్స్ ఎన్ఐటీటీఈ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ అన్నారు. శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అంతర్జాతీయ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ ఉన్నత విద్యను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. ఇంటర్న్‌షిప్ రూపకల్పన, ఫండింగ్, ఉద్యోగాలు పొందడానికి శిక్షణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అవగాహన సదస్సుల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, సీఎస్ఈ హెచ్ఓడీ ఫరూక్, కోఆర్డినేటర్ షర్మిల, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో డీఎస్ఏ కోచ్ రాజు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 17: కాకినాడలోని పీఠాపురంలో ఈనెల 20, 21వ తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్స్ కుస్తీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను బుధవారం ఎంపిక చేశారు. నంద్యాల జిల్లా అమేచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల సీనియర్స్ కుస్తీ పోటీలు నిర్వహించారు. వివిధ విభాగాలలో బరువుల వారీగా నిర్వహించిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్ రాజు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లాకు పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి రాబర్ట్, రెజ్లింగ్ కోచ్ పుల్లయ్య, కరాటే మాస్టర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మరియానందం

నంద్యాల (నూనెపల్లె), జనవరి 17: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి మరియానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తుంటే అంతకంటే ప్రమాదకరమైన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, జిల్లా కార్యదర్శులు పుల్లయ్య మునిస్వామి, పవన్‌కుమార్, జిల్లా మహిళా కార్యదర్శి బేబీరాణి, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నూతన కమిటి ఎన్నిక

ఆత్మకూరురూరల్, జనవరి 17 : పట్టణంలోని మార్కెట్ యార్డులో ఎంఎస్పీ జాతీయ నాయకులు చిలుక రాబిన్‌సన్, ఎమ్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బెనర్జి, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు ఆధ్వర్యంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా, శ్రీశైల నియోజకవర్గ మండలాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులుగా నాగళ్ల సురేష్, ఎంఎస్పీ జిల్లా నాయకులుగా బూదల దానియేలును, శ్రీశైలం మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా రవికుమార్, గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాస్‌ను, ఎమ్మెస్పీ శ్రీశైలం మండల అధ్యక్షుడిగా జడ్ల పాపయ్యను, ఆత్మకూరు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఓనమాల పుల్లయ్యను, గౌరవ అధ్యక్షులుగా శ్యాం మాదిగలను వెలుగోడు మండల కన్వీనర్‌గా వెంకటేశ్వర్లును, ఎంఎస్ఎఫ్ కన్వీనర్‌గా మురళీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బాషపోగుల దరగయ్య, నాగశేషులు, బుజ్జి, నాగయ్య, దేవసహాయం, వెంకటరమణ, నాని, వరదరాజులు, రంగ స్వామి తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో నిరవధిక దీక్ష కొనసాగిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



జూపాడుబంగ్లాలో మోకాళ్లపై, ఉరితాళ్లు బిగించుకొని నిరసన

కొనసాగుతున్న నిరసన

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ తలపెట్టిన సమ్మె బుధవారం నాటికి 37వ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకూ పట్టు వీడమంటూ భీష్మించారు. ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించినా ఏ మాత్రం బెదరకుండా 37వ రోజు అదేపట్టుతో పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు వినూత్న నిరసనలు తెలుపుతూ నిరవధిక దీక్షలు కొనసాగిస్తున్నారు. పాములపాడులో అంగన్వాడీ వర్కర్లు దీక్ష శిబిరం వద్ద మోకాళ్లపై నిల్చొని ప్రభుత్వానికి వ్యతిరేక వినాదాలు చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలిపారు. అలాగే జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉరితాళ్లతో నిరసన తెలిపారు. నంద్యాలలోని దీక్షా శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. నందికొట్కూరు పట్టణంలోని నందికొట్కూరు- నంద్యాల రోడ్డుపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల పోరాటానికి సంఘీ భావంగా రాస్తారోకో నిర్వహించారు. ఆత్మకూరులోని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు శవాసనం వేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

- (ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



పాములపాడులో మోకాళ్లపై అంగన్‌వాడీల నిరసన



ఆత్మకూరులో శవాసనం వేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

సామాజిక న్యాయ మార్గంలో నడవాలి

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

నంద్యాల (కల్చరల్), జనవరి 17: ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన భారతరత్న డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ కారిడార్‌లో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఛాయా చిత్రప్రదర్శనను జాయింట్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలో దాదాపు రూ.400కోట్లతో 20 ఎకరాలలో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటుతో పాటు 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా ఘనంగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని సమాచార పౌర సంబంధాల శాఖ వారు ఛాయా చిత్ర ప్రదర్శన కలెక్టరేట్లో ఏర్పాటు చేశారు. అనంతరం దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాస్, మాలమహానాడు రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు లింగస్వామి, తదితరులు రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్



చిత్ర పదర్శనను తిలకిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

జీవితచరిత్ర, ఆయన సమాజానికి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, తదితర అధికారులు, వివిధ దళిత సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలవేసి ఘనంగా నివాళి అర్పించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

- బ్యాంకింగ్ డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫైనాన్స్ సర్వీస్ న్యూ ఢిల్లీ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌కుమార్

ఆత్మకూరురూరల్, జనవరి 17 : వివక్షకు తావు లేకుండా సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ అనే నినాదంతో 2047 లోపు భారత్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బ్యాంకింగ్ డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫైనాన్స్ సర్వీస్ న్యూ ఢిల్లీ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో జిల్లా అధికారులతో కలిసి వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన, పోషణ్ అభియాన్, పీఎం ఆవాస్ యోజన తదితర కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల స్టాళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి పేదవాని అభివృద్ధికి అన్ని సదుపాయాలు అందిచాలన్న సంకల్పంతో వివిధ పథకాలను రూపొందించిందన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని జీవనోపాధిని పెంపొందించుకొని ఆర్థిక పరిపుష్టి చెందాలని సూచించారు. విద్య వైద్య సేవలు ప్రతి ఇంటికీ చేర్చడం కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని, దీని ద్వారా కేంద్ర పథకాలను ఉపయోగించుకుంటూ కుటుంబాలకు ఆసరాగా ఉండాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష ,బీమా,



కరివేనలో వికసిత్ సంకల్ప యాత్రను ప్రారంభిస్తున్న సంజయ్‌కుమార్

పథకం ప్రమాదాలు జరిగినపుడు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల పక్కన మన దేశం నిలబడాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని ప్రజలకు వివరించారు. అనంతం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పుల్లయ్య, ఆర్డీవో మిరియాల దాసు, డీపీవో మంజులవాణి, ఏపీజీబీ రిజినల్ మేనేజర్ నవీన్‌కుమార్, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, నాబార్డు మేనేజర్ సుబ్బారెడ్డి, డీఏవో మోహనరావు, కేడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ శివలీల, ఎంపీడీవో మోహన్‌కుమార్, సర్పంచు మాణిక్యమ్మ, ఎంపీపీ తిరుపాలమ్మ, జడ్పీటీసీ శివశంకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సిందే

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

నందికొట్కూరు, జనవరి 17: అంగన్వాడీ మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా మహిళలపై నిర్బంధం ప్రయోగిస్తే జగన్మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం అంగన్వాడీ పోరాటానికి మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో నందికొట్కూరులో అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ముర్తుజావలి, జనసేన నాయకులు రవికుమార్, నాగరాజు మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా చిన్న పిల్లలకు బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఈ సంస్థను కేంద్ర ప్రభుత్వం తెచ్చిందన్నారు. నరేంద్ర మోదీ 8 సంవత్సరాలలో తను ఆహారానికి వినియోగిస్తున్న ఖర్చు దాదాపు రూ.110 కోట్లు ఖర్చు చేశారని, ప్రతి సంవత్సరం తన వ్యక్తిగత తిండి కోసం రూ.12 కోట్లు ఖర్చు పెడుతున్న మోడీ పసిపిల్లలు, గర్భవతులకు పౌష్టికాహారాన్ని అందించడానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడం విచారకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ కన్నా రూ.1000 అదనంగా ఇస్తామని ఇచ్చన వాగ్దానాన్ని అమలు చేయాలని అడుగుతున్న అంగన్వాడీ మహిళలపైన నిర్బంధం ప్రయోగించడం, ఎస్మా చట్టం తీసుకురావడం సోకాజ్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీ



రౌండ్ టేబల్‌సమావేశంలో ఐక్యత చాటుతున్న అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు

మహిళల ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీల ప్రజా సంఘాలు మద్దతు తెలియజేయాలని ఆయన తీర్మానాన్ని ప్రతిపాదించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముర్తుజావలి, భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇంతియాజ్ భాష, జనసేన నాయకులు రవికుమార్, నాగరాజు, సీపీఎంఎల్ నాయకులు లాజరస్, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రేమరాజు, బీసీ సంఘం నాయకులు గోకారి, సిఐటియు జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, రైతు సంఘం కార్యదర్శి బెస్తరాజు, కెవిపిఎస్ నాయకులు రంగమ్మ, జయరాణి, మహిళా సంఘం రత్నమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రథయాత్రను విజయవంతం చేయండి

ఆత్మకూరు, జనవరి 17: బీసీలకు రాజకీయ పార్టీలు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సాగే బీసీ రథయాత్రను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు రఘురాముడు యాదవ్, వెంకటస్వామి, బాలస్వామియాదవ్, రామకృష్ణ, శ్రీహరి, వీరన్న కోరారు. బుధవారం బీసీ రథయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ పలు బీసీ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా బీసీలను ఓటు బ్యాంకుగా గుర్తిస్తున్నారే తప్ప వారికి రాజకీయ రంగంలో సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన బీసీలకు సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగాల్లో కూడా బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని చెప్పారు. కాగా ఈ రథయాత్ర ప్రారంభోత్సవంలో భాగంగా ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించి తర్వాత బహిరంగ సభ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అస్వస్థత'



గోస్పాడులో అస్వస్థతకు గురైన అంగన్‌వాడీ హెల్పర్ భాగ్యమ్మ

గోస్పాడు, జనవరి 17: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 37 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఒత్తిడికి గురై అంగన్‌వాడీ హెల్పర్ భాగ్యమ్మ అస్వస్థకు గురయ్యారని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు నిర్మల తెలిపారు. అస్వస్థతకు గురైన భాగ్యమ్మను నంద్యాల ఆసుపత్రికి తీసుకెళ్లామని, బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయిందని డాక్టర్లు తెలిపారని అన్నారు. ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమ నిర్లక్ష్యంతో ఎంత మందిని బలి తీసుకుంటుందని విమర్శించారు. అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో రమణమ్మ, సువర్ణ, రామరుక్మిణి, చంద్రలీలా, ఉసేనమ్మ, చెన్నమ్మ, పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పదోన్నతుల సమస్య పరిష్కరించాలి

గోస్పాడు, జనవరి 17: చాలా కాలంగా నిలిచిపోయిన తెలుగు ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యను పరిష్కరించి పదోన్నతులు చేపట్టాలని పీఆర్‌టీయూ గోస్పాడు మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గోస్పాడులో ఆయన మాట్లాడుతూ కోర్టులో ఉన్న తెలుగు ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యపై ప్రభుత్వం చొరవ చూపించి పరిష్కరించాలని, సరెండర్ లీవ్ ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. మహిళా ఉపాధ్యాయుల చైల్డ్ కేర్ సెలవులను సర్వీస్‌లో ఎప్పుడైనా వాడుకునే విధంగా ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు విజయరావు, సికిందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

గోస్పాడు, జనవరి 17: కేంద్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా ఇస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ అన్నారు. మండలంలోని ఒంటివెలగల గ్రామంలో ఉపాధి హామీ పథకంలో హార్టికల్చర్ రైతు అయిన దేశ పుల్లమ్మ పొలంలో నాటిన టెంకాయ మొక్కలను పరిశీలించారు. వీటి సంరక్షణకు ప్రభుత్వం నిధులు ఇస్తుందని, ఇవి పెరిగి ఫలానికి వచ్చినప్పుడు రైతులకు ఎంతో ఆర్థికంగా ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారు.

జాగ్రత్తగా వాహనాలు నడపాలి

పాణ్యం, జనవరి 17 : డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాలని కర్నూలు, కడప జాతీయ రహదారి 40 ప్రాజెక్ట్ హెడ్ మదన్‌మోహన్ అన్నారు. బుధవారం తమ్మరాజుపల్లె సమీపంలోని రాజస్థాన్ డాబా వద్ద 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రహదారి నియమాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవింగ్ చేసే వ్యక్తి మానసికంగా ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. డ్రైవింగ్‌పై కరపత్రాలు పంపిణీ చేశారు. డ్రైవర్లు నియమనిబంధనలు తప్పనిసరిగా పాటిస్తే ఎవరూ ప్రమాదాలకు గురికారని సూచించారు. మెయింటెనెన్స్ హెడ్ గౌరినాయుడు, అధికారి కటారుకొండ రంజిత్‌రెడ్డి, ఆపరేషన్ హెడ్ అరుణ్ రాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజేతగా ప్రొద్దుటూరు వృషభాలు



పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు మనోహర్‌చౌదరి

బండిఆత్మకూరు, జనవరి17 : నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం ఎద్దుల బలప్రదర్శన పోటీల్లో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డి, నంద్యాల జిల్లా కానాల చెన్నారెడ్డి ఎద్దులు సంయుక్త ప్రథమ విజేతగా నిలిచాయి. బుధవారం నిర్వహకుడు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలను మండల సీనియర్ టీడీపీ నాయకుడు, సంతజూటూరు సొసైటీ మాజీ చైర్మన్ కంచర్ల మనోహర్ చౌదరి ప్రారంభించారు. అలాగే రెండవ విజేతగా నంద్యాల జిల్లా గడివేముల మండలం పెసరవాయికి చెందిన కలాంబాష ఎద్దులు, మూడవ విజేతగా సంజామల మండలం చిన్న కానాల చెన్నారెడ్డి, ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీ నెహారెడ్డి, మోక్షిత్‌రెడ్డి ఎద్దులు, నాల్గవ విజేతగా బండిఆత్మకూరు మండలం ఏ కోడూరుకు చెందిన వెంకటరెడ్డి ఎద్దులు గెలుపొందాయి, వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.12వేలు నగదు బహుమతి కృష్ణనాయక్ అందజేశారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

ఆత్మకూరు, జనవరి 17: పట్టణంలో గురువారం దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 28వ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్ బుధవారం తెలిపారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక గౌడ్‌సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించనున్నట్లు తెలిపారు. అలాగే అక్కడే మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే టీడీపీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

నల్లమల అడవుల అభివృద్ధికి కృషి

- పది లక్షల పనిముట్లు విరాళం

పాములపాడు జనవరి 17 : నల్లమల వన్యప్రాణుల, అడవుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆవుల పుల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్, నల్లమల ఫారెస్ట్ నంద్యాల జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్ ఆవుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బానకచెర్ల గ్రామంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్‌యస్‌టీఆర్ ప్రకాశం, నంద్యాల జిల్లా ఫారెస్ట్ అధికారులు బీఎన్ఎన్ మూర్తి, ఐఎఫ్ఎస్ అనురాగ్ మీనా డీఎఫ్ఓ, అధికారులు శ్రీపతి నాయుడు, శ్రీనాథ్‌రెడ్డి, నాసిర్ ఆత్మకూరు, మార్కపురం అటవీశాఖ సిబ్బందికి ఉపయోగపడే 15 ఫైర్ బ్లోయర్లు, 14 గ్రాస్ కట్టర్స్, 8లక్షల రూపాయల విలువ గల పనిముట్లను తన నిధుల ద్వార కొనుగోలు చేసి విరాళంగా అందచేశారు. అటవీశాఖ అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఫారెస్ట్ వైల్డ్ లైఫ్ పువ్వాడి భాస్కర్, ఎంపీపీ లాలం రమేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదేవళాపురంలో ముగిసిన సరిగెత్తు

బండిఆత్మకూరు, జనవరి17: మండలంలోని పెద్దదేవళాపుర ం గ్రామంలో పెద్ద, చిన్న బాదుల్లా స్వామి వార్ల సరిగెత్తు ముగిసింది. రెండు రోజులుగా నిర్వాహకులు పెద్దబాలన్న, కుమారుడు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో స్వామి వార్ల సరిగెత్తు వైభవంగా సాగింది. బుధవారం తెల్లవారు ఝాము వరకు గ్రామస్థులు స్వామి వార్లకు చూసెకాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మేళతాళాల వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని ఓ బావిలో స్వామి వార్లకు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.



పెద్దదేవళాపురంలో పెద్ద, చిన్నబాదుల్లా స్వామి వార్ల గ్రామోత్సవం

కొనసాగుతున్న నిరసనలు

● 37వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె ● వినూత్నంగా నిరసనలు ● సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె ఆపబోమని స్పష్టం ● కార్మిక సంఘాల మద్దతు


శిరివెళ్లలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు


కోవెలకుంట్లలో మోకాళ్లపై నిరసన


చాగలమర్రిలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

డోన్(రూరల్), జనవరి 17: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన దీక్షలు బుధవారం కూడా కొనసాగాయి. అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన దీక్షలు 37వ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోకన్వీనర్ జులైఖ, ఏఐటీయూసీ నాయకులు పుల్లయ్య, అబ్బాస్ అన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం సమ్మె కొనసాగించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

శిరివెళ్ల: డిమాండ్లు సాధించుకునే దాకా పోరాటం సాగిస్తామని అంగన్‌వాడీ కార్మికులు అన్నారు. శిరివెళ్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం రిలే నిరాహార దీక్ష చేశారు. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వారు ఆరోపించారు.

చాగలమర్రి: అంగన్‌వాడీల సమస్య పరిష్కరించే వరకు సమ్మె ఆగదని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు హెచ్చరించారు. బుధవారం చాగలమర్రి అంబేడ్కర్ విగ్రహం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు నల్ల బ్యాడ్జీలతో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన చేశారు. సమ్మె కొనసాగిస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు అన్నారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. 37 రోజులుగా అంగన్‌వాడీ సిబ్బంది దీక్షను కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడం దారుణమన్నారు.

రుద్రవరం: రుద్రవరంలో నిర్వహిస్తున్న అంగన్వాడీల నిరసన బుధవారం 37వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ నాయకురాళ్లు మనోజా, రాజ్యలక్ష్మి, బీబీ, తిరుపాలమ్మ మాట్లాడుతూ 37 రోజుల నుంచి శాంతియుతంగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఇలా హామీలిచ్చి అమలు చేయకుండా మడమ తిప్పడం అంటే సీఎం జగన్‌కే సాధ్యపడిందని విమర్శించారు.

బనగానపల్లె: అంగన్‌వాడీ కార్యకర్తలు, బనగానపల్లెలో బుధవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. దీక్ష అనంతరం తహసీల్దారు కార్యాలయం నుంచి ర్యాలీగా బయలు దేరి సీడీపీవో కార్యాలయంలో సీడీపీవోకు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలను బెదిరిస్తూ ఎస్మాచట్టం, నోటీసులు ఇస్తోందని, ఎన్ని నిర్బంధాలు విధించినా సమ్మె ఆగదని సీఐటీయూ నాయకులు, సుబ్బయ్య, ఎల్లయ్య, అంగన్‌వాడీ నాయకురాలు రోజారమణి అన్నారు.

కోవెలకుంట్ల: జీతాలు పెంచేవరకు సమ్మెకుఆపేది లేదని అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన దీక్ష 37వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


దొర్నిపాడులో..



రుద్రవరంలో..


బనగానపల్లెలో..


ఆళ్లగడ్డలో..


డోన్‌లో..

బాచేపల్లెలో పల్లకీ ఉత్సవం


బాచేపల్లెలో పూజలు చేస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ, జనవరి 17: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకీ ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె గ్రామానికి చేరుకోగా ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని తెలుపుల వద్ద ఉత్సవ పల్లకి విడిది చేయడంతో ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామి, జ్వాలా నరసింహస్వాములు పూజలందుకున్నారు. ఉత్సవ పల్లకికి ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి పూజలు చేశారు. గ్రామ ఎంపీటీసీ నాగేశ్వరరావు, సర్పంచ్ శీలం వెంకటేశ్వరరెడ్డి, గ్రామ ప్రజలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. గురువారం ఆళ్లగడ్డ మండలంలోని కొండంపల్లి, ఆర్.క్రిష్ణాపురం గ్రామాల్లో అహోబిలేశుడు పూజలు అందుకోనున్నారు.

రెహిమాన్‌పురంలో అమ్మవార్ల జాతర


సుంకులమ్మను దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల, జనవరి 17: మండలంలోని రెహిమాన్‌పురం గ్రామంలో పెద్దమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బుధవారం జాతర నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని 54 ఏళ్ల తర్వాత గ్రామంలో సుంకులమ్మ, పెద్దమ్మ జాతర నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు. అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శివశంకర్ నాయక్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

వైసీపీ ఓటమి ఖాయం: కాంగ్రెస్


సమావేశంలో మాట్లాడుతున్న గార్లపాటి మద్దిలేటి

డోన్(రూరల్), జనవరి 17: వచ్చే సాధారణ ఎన్నికల్లో వైసీపీ పార్టీ ఓటమి ఖాయమని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, డోన్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గార్లపాటి మద్దిలేటి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జనార్దన్ యాదవ్, వై.శేఖర్, గోపీనాథరావు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత చిన్నకంబలూరు జట్టు

రుద్రవరం, జనవరి 17: మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతగా చిన్నకంబలూరు జట్టు నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. బుధవారం నిర్వహించిన ఫైనల్ కబడ్డీ మ్యాచ్‌లో చిన్నకంబలూరు భరత్ టీం విజేతగా నిలిచిందన్నారు. రెండో విజేత రమేష్ టీం చిన్నకంబలూరు, మూడో విజేత సిరివెళ్ల మండలం కోటపాడుకు చెందిన జట్టు, నాలుగో విజేత దొర్నిపాడు మండలం చాగరాజాముల దస్తగిరి జట్టు విజేతగా నిలిచిందని చెప్పారు. విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందించినట్లు తెలిపారు. బాలీశ్వర్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, ప్రసాద్, నందయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'


మాట్లాడుతున్న అన్సర్‌బాషా

చాగలమర్రి, జనవరి 17: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. బుధవారం చాగలమర్రి అంబేడ్కర్ విగ్రహం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు అనీఫ్, అజీమ్, గఫార్, కింగ్‌హుసేన్, షరీఫ్, ఆలీ, అబ్దుల్లా పాల్గొన్నారు.

'విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు'

ఆళ్లగడ్డ, జనవరి 17: విద్యతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుం దని ప్రముఖ పారిశ్రామిక వేత్త, అహోబిలం బలిజ, కాపు అన్న సత్రం అధ్యక్షుడు శెట్టి విజయకుమార్ అన్నారు. శిరివెళ్ల మండల పరిధిలోని ఖాదరబాదరాకు చెందిన రాకేష్‌కు మూడు చక్రాల సైకిల్ బుధవారం పంపిణీ చేశారు. రాకేష్ పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతుండడంతో సైకిల్ అందించారు. శెట్టి ప్రణీత్, రాయల్ కాప్స్ రాష్ట్ర గౌరవ సలహాదారుడు గూడూరు సంజీవరాయుడు, నీలి రామారావు, ప్రసాదు, సంతోష్, మునయ్య తదితరులు పాల్గొన్నారు.

'రైలులో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి'

కోవెలకుంట్ల, జనవరి 17: నంద్యాల - రేణిగుంట్లకు వెళ్లే డెమో ట్రైన్‌లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు కామిని వేణుగోపాల్‌రెడ్డి, గడ్డం అమర్‌నాథరెడ్డి కోరారు. బుధవారం కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌ను పరిశీలించడానికి వచ్చిన రైల్వేశాఖ ఏజీఎంకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ నంద్యాల నుంచి కడప వరకు తిరిగే డెమో రైలును రేణిగుంట వరకు పొడిగించి ఈప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. అయితే నంద్యాల నుంచి రేణిగుంట వరకు ప్రయాణం చేయాలంటే సుమారు 300 కిలో మీటర్లు ఉంటుందన్నారు. బాత్‌రూంలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

30 పడకల ఆసుపత్రి ప్రారంభం

కోవెలకుంట్ల, జనవరి 17: కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో నూతనంగా నిర్మించిన 30 పడకల ఆస్పత్రి భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డితో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు 30 పడకల ఆస్పత్రిని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఇరిగేషన్‌శాఖ చైర్మన్ కర్రా గిరిజమ్మ, జడ్పీటీసీ వెంకటలక్ష్మమ్మ, వైసీపీ నాయకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, బీవీ నాగార్జునరెడ్డి, జీసీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

దొర్నిపాడు, జనవరి 17: చాకరాజువేముల ఎస్సీ కాలనీలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులను అందజేశారు. పోటీలో పాల్గొన్న మహిళలకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాలనరసింహుడు, వెంకటయ్య, ఓబులేసు, నాగరాజు, లక్ష్మీతిరుపాలు, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై ప్రణాళిక

చాగలమర్రి, జనవరి 17: గ్రామాల అభివృద్ధిపై ప్రణాళిక సమీక్ష సమావేశాన్ని ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీడీవో మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో బుధవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిం చారు. గ్రామాల అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. శెట్టివీడు, చింతలచెరువు, గొడిగనూరు, డి.వనిపెంట, పెద్దవంగలి, కేపీ తాండ, చాగలమర్రి గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులచే సమావేశం నిర్వహించి గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రుద్రవరం, జనవరి 17: మండలంలోని దక్షిణ కొట్టాల గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు బుధవారం సర్పంచ్ పెద్దపల్లె నరసింహారెడ్డి తెలిపారు. గ్రామంలో ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. ప్రజలకు గ్రామంలో అన్ని సౌకర్యాలు చేకూరుస్తున్నామని ఆయన తెలిపారు.

వైభవంగా పవిత్రోత్సవం

చాగలమర్రి, జనవరి 17: చాగలమర్రిలోని ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్పస్వామి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా పవిత్రోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. మకర జ్యోతి ముగింపు సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేశారు. అయ్యప్పస్వామి విగ్రహంతో పల్లకి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సుంకు జనార్దన్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: మంత్రి


ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

డోన్, జనవరి 17: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని కేవీఎస్ పార్కులో బుధవారం మంత్రి బుగ్గన మార్నింగ్ వాక్‌ను నిర్వహిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యోగా సెంటర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, కౌన్సిలర్లు దినేష్‌గౌడు, మహేశ్వరరెడ్డి, మల్లికార్జున రెడ్డి, ఆర్బ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూమిని కాపాడాలి'


వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ప్యాపిలి, జనవరి 17: ప్రభుత్వ భూమి ఆక్రమణ కాకుండా కాపాడాలని మండలంలోని వెంగళాంపల్లి రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని 371 సర్వే.నెంబరులో 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దానిని కొందరు ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్ఐ సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

పంట నమోదు తప్పనిసరి

చాగలమర్రి, జనవరి 17: గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ సూచించారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీకి సంబంధించి సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. ఆర్బీకేల్లో రైతులు తమ పంట వివరాలను తెలియజేయాలని అన్నారు. ఏఈవో మంజుల, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

ఆళ్లగడ్డ, జనవరి 17: టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు జన్మదిన వేడుకలను బుధవారం న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో పూలమాలలతో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేయించారు. న్యాయవాదులు రమణయ్య, శివప్రసాద్, నరసయ్య, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, శ్రీనివాసులు, సుదర్శన్, రుషికేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుందూలో నిలిచిన నీటి ప్రవాహం

● ఆందోళనలో రైతులు


కుందూ నదిలో నిలిచిన నీటి ప్రవాహం

ఉయ్యాలవాడ, జనవరి 17: మండలంలోని కుందూ నదిలో నీటి ప్రవాహం నిలిచిపోయింది. గత నాలుగు ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా నీటి ప్రవాహం పూర్తిగా నిలిచింది. జనవరి నెలలోనే నీళ్లు నిలిచి పోవంటతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో మండలంలోని కుందూ తీర ప్రాంత రైతులు దాదాపుగా 200 ఎకరాలకు పైగా మిరప పంటను సాగు చేశారు. ప్రస్తుతం మిరప పంట తొలి కోత దశ పూర్తయింది. మరో మూడు, నాలుగు కోతల దిగుబడులు రావాల్సి ఉంది. ఇంతలోనే కుందూలో నీరు నిలిచి పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్చి చివరి వరకు నీళ్లు ఇస్తే తప్ప మిరప పంట పూర్తిగా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా మండలంలోని హరివరం, అల్లూరు, మాయలూరు, సుద్దమల్ల, నర్సిపల్లె, రూపనగుడి, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, ఇంజేడు, పెద్దయమ్మనూరు, కాకరవాడ, ఒంటెద్దుపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాలకు త్రాగునీరు కూడా అందించాల్సి ఉంది. నీటి ప్రవాహం నిలిచి పోతే తాగునీటి సమస్యల తలెత్తే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంది. ప్రజా ప్రతి నిధులు, అధికారులు స్పందించి కుందూకు నీళ్లు వదలాలని కోరుతున్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి


ముత్తలూరు నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి అఖిలప్రియ

రుద్రవరం, జనవరి 17: మండలంలోని ముత్తలూరు గ్రామానికి చెందిన మాలపాటి రామసుబ్బారెడ్డి (50) టీడీపీ నాయకుడు మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. రామసుబ్బారెడ్డి నరసింహస్వామి మాల మంగళవారం ఉదయం ధరించి రాత్రి పార్వేట పల్లకి బయల్దేరే సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆళ్లగడ్డకు తరలించే లోపే మృతి చెందారు. రామసుబ్బారెడ్డికి భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రముఖుల నివాళి

మంగళవారం రాత్రి ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భూమా విఖ్యాత్‌రెడ్డి, భార్గవరామ్‌నాయుడు మృత దేహాన్ని పరిశీలించారు. బుధవారం గ్రామాన్ని చేరుకుని మృత దేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, బీజేపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి, టీడీపీ నాయకులు బాచుపల్లె వెంకటనారాయణ ఇంకా పలువురు నివాళి అర్పించారు. ముత్తలూరు గ్రామంలో టీడీపీ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్‌నాయుడు రామసుబ్బారెడ్డి పాడెను మోశారు. నల్లవాగుపల్లె పార్థసారథిరెడ్డి, రెక్కల మనోహర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి తదితరులు నివాళి అర్పించారు.

'పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించాలి'

బేతంచెర్ల, జనవరి 17: మండలంలోని గ్రామ పంచాయితీ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ నాగభూషణం రెడ్డి సూచించారు. బుధవారం బేతంచెర్ల పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలు (జీపీడీపీ)పై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఈ అవగాహన సదస్సు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నాగభూషణం రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంగన్న నిర్వహించారు. సమావేశంలో ఈవోఆర్డీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఏవో దస్తగిరిబాబు, మండల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఫ్రంట్‌లైన్ వర్కర్స్ వార్డు మెంబర్లు, ఎస్‌జీహెచ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి


బేతంచెర్లలో నివాళి అర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

బేతంచెర్ల, జనవరి 17: పట్టణంలోని బలిజ సంఘం కార్యాలయంలో శ్రీకృష్ణదేవరాయల 563వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు హరికృష్ణుడు, సుబ్బారెడ్డి, వీరభద్రుడు, శ్రీనివాసులు, మద్దిలేటి, మురళి పాల్గొన్నారు.


ఉయ్యాలవాడలో..

ఉయ్యాలవాడ: మండలంలోని ఉయ్యాలవాడలో శ్రీకృష్ణదేవరాయలు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం బలిజ సంఘం నాయకులు శ్రీకృష్ణదేవరాయులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. బలిజ సంఘం కోశాధికారి అర్జిగారి నరసింహుడు, గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి, అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు ఉశేనయ్య, చిన్నరాముడు, శివరాం తదితరులు పాల్గొన్నారు.